సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



గద్దెనెక్కిన సమ్మక్క

ఉమ్మడి జిల్లాలోని చిన్న మేడారాలు భక్తులతో కోలాహలంగా మారాయి. గురువారం సమ్మక్క గద్దెనెక్కింది. - 8లో



బడి ఇలా.. చదివేది ఎలా!

రామన్నపేటలోని బాలికల ఉన్నత పాఠశాల శిథిల భవనంలో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతోంది. - 9లో



ఆలేరు బడ్జెట్‌కు ఆమోదం

2024 -25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన ఆలేరు మున్సిపల్ బడ్జెట్ కౌన్సిల్ ఆమోదం పొందింది. - 9లో

న్యూస్‌రీల్

అదనపు సీఎంఆర్‌ను 29 లోపు పూర్తి చేయాలి

సాక్షి,యాదాద్రి : అదనంగా ఇచ్చిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) లక్ష్యాన్ని ఈనెల 29వ తేదీలోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మిల్లర్లకు సూచించారు. గురువారం ఆయన తన చాంబర్‌లో మిల్లర్లతో సమావేశం అయ్యారు. గడువు సమీపిస్తున్నందున అదనంగా ఇచ్చిన 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 29లోగా అప్పగించాలని కోరారు. సమావేశంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మిల్లర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు



మాట్లాడుతున్న డీఐఈఓ రమణి

భువనగిరి : ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ రమణి సూచించారు. గురువారం భువనగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చీఫ్ సూరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యవేక్షణకు 30 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, డీఓలతో పాటు ఫ్లెయింగ్ స్క్వాడ్స్‌ను నియమించినట్లు చెప్పారు. కేంద్రాలకు పరీక్ష సామగ్రి అందజేస్తున్నామని, సంబంధిత అధికారులు తీసుకెళ్లాలని కోరారు.

యాదాద్రిలో నిత్యారాధనలు



పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాతం, నిజాభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి,, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అదనపు కలెక్టర్‌పై లోకాయుక్తకు ఫిర్యాదు

యాదగిరిగుట్ట రూరల్: గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలను అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని యాదగిరిగుట్ట మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన మక్కల దుర్గయ్య గురువారం లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఆయనపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నూతన చాంబర్‌లోకి ప్రభుత్వ విప్ ఐలయ్య



ప్రభుత్వ విప్ ఐలయ్యకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అసెంబ్లీలో తనకు కేటాయించిన చాంబర్‌లోకి గురువారం ప్రవేశం చేశారు. చాంబర్‌లో యాదాద్రి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి ఐలయ్యకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేషం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి, నాయకులు దుంబాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు యాదాద్రి పవర్ ప్లాంట్‌ను సందర్శించనున్న మంత్రులు

నల్లగొండ: దామరచర్ల మండలం వీర్లపాలెంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పరిశీలించేందుకు శనివారం ముగ్గురు మంత్రులు రానున్నారు. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పవర్ ప్లాంట్‌ను పరిశీలించిన అనంతరం జెన్‌కో అధికారులతో సమావేశమై ప్లాంట్ నిర్మాణ పనులపై చర్చిస్తారు.

• కమనీయం.. నృసింహుడి కల్యాణం





యాదాద్రి పూర్వగిరీశుడి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీస్వామి, అమ్మవారి కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, కల్యాణతంతు నిర్వహిస్తున్న ప్రధానార్చకులు

గుట్టలోనే మెడికల్ కాలేజీ

జీఓ నంబర్ 85 జారీ చేసిన ప్రభుత్వం

- తాత్కాలికంగా పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు
- 50 సీట్లతో ప్రారంభం
- డీఎంఈ పరిధిలోకి వెళ్లిన జిల్లా కేంద్ర ఆస్పత్రి
- 28 మంది నర్సులు రిలీవ్



తాత్కాలికంగా మెడికల్ కళాశాల ఏర్పాటు చేయనున్న పాత కలెక్టరేట్ భవనం

భువనగిరి : జిల్లాకు మంజూరైన ప్రభుత్వ మెడికల్ కళాశాల యాదగిరిగుట్ట సమీపంలోని మల్లాపురంలోనే ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తాజాగా జీఓ 85ను జారీ చేసింది. దీంతో మెడికల్ కాలేజీని తరలిస్తారని కొంతకాలంగా జరుగుతున్న వదంతులకు తెరపడింది. 2023 జూలై 6 తేదీన గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేసింది. మల్లాపురం పరిధిలోని సర్వే నంబర్ 64లో 20 ఎకరాల్లో రూ.183 కోట్ల వ్యయంతో కాలేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే సాంకేతిక కారణాల వల్ల అలస్యం జరిగింది. ఈ క్రమంలో మెడికల్ కళాశాలను మరో ప్రాంతానికి తరలిస్తున్నట్లు ప్రచారం జరగడంతో గందరగోళానికి దారి తీసింది. అయితే వదంతులకు తెరదించుతూ ప్రభుత్వ కొత్త జీఓ జారీ చేసింది. తాత్కాలికంగా కళాశాల ఏర్పాటుకు భువనగిరి పట్టణంలో పలు ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. పగిడిపల్లి పరిధిలోని పాత కలెక్టరేట్ అనుకూలంగా ఉండడంతో అందులోనే హాస్టల్, తరగతులు ఏర్పాటు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు.

కళాశాలకు అనుబంధంగా జిల్లా కేంద్ర ఆస్పత్రి

పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం కానుంది.ప్రారంభంలో 50 సీట్లతో నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మెడికల్ కళాశాలకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అనుబంధంగా కొనసాగనుంది.

డీఎంఈ పరిధిలోకి జిల్లా ఆస్పత్రి

ఇప్పటి వరకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో ఉన్న భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి వెళ్లింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు సైతం వెలువడ్డాయి. జిల్లా కేంద్ర ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో అందులో పనిచేస్తున్న 28 మంది నర్సులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీవీవీపీ పరిధిలోని ఏడు ఆస్పత్రులకు బదిలీ చేశారు. చౌటుప్పల్ సీహెచ్‌సీకి 16, ఆలేరు సీహెచ్‌సీకి 4, హన్మకొండ ఏరియా ఆస్పత్రికి 3, నకిరేకల్ ఆస్పత్రికి 3, కోదాడ, హైదరాబాద్‌లోని మలక్‌పేట, కింగ్ కోటి ఆస్పత్రులకు ఒక్కొక్కరిని బదిలీ అయ్యారు.

ఆస్పత్రికి అభివృద్ధికి అవకాశాలు

మెడికల్ కళాశాలకు అనుబంధంగా కొనసాగడం వల్ల జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉన్నాయి. 50 సీట్లతో ప్రారంభం కానున్న కళాశాలకు భవిష్యత్తులో 200 సీట్లు మంజూరయ్యే అవకాశం ఉంది. 200 సీట్ల కళాశాలకు 500 పడకల ఆస్పత్రి అవసరం ఉంటుంది. కాగా మల్లాపురంలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా 100 పడకల ఆస్పత్రి మాత్రమే నిర్మించనున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి తప్పనిసరిగా అనుబంధంగా కొనసాగే అవకాశం ఉండనుంది. ఈ క్రమంలో డీఎంఈ నిబంధనల ప్రకారం జిల్లా ఆస్పత్రిలో వసతులు, వైద్య సేవలు పెంచవల్సి ఉంటుంది.

> **పాత కలెక్టరేట్‌లో కళాశాల**
>
> యాదగిరిగుట్ట సమీపంలో మెడికల్ కళాశాల భవన సముదాయం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా పగిడిపల్లి పరిధిలోని పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేస్తాం. భవనం అనువుగా ఉండడంతో ఇక్కడే హాస్టల్, తరగతుల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం. ఈ విద్యా సంవత్సరం నుంచే 50 సీట్లతో కళాశాల ప్రారంభంకానుంది. యాదగిరిగుట్టలో భవన సముదాయం పూర్తయిన తర్వాత అక్కడి కళాశాల తరలిస్తారు.
>
> –చిన్నానాయక్, డీసీహెచ్ఎస్

సేవాలాల్ మార్గంలో నడవాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య. చిత్రంలో కలెక్టర్ తదితరులు

యాదగిరిగుట్ట రూరల్ : సంత్ సేవాలాల్ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని, ఆయన చూపిన మార్గంలో నడవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలోని దేవానాయక్ మఠ్రి దేవాలయంలో సంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కలెక్టర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ... సంత్ సేవాలాల్ హిందూ ధర్మాన్ని కాపాడిన గొప్ప మహనీయుడని, ఆయన ఉపదేశాలు ఎంతోమందికి స్ఫూర్తినిచ్చాయన్నారు. పిల్లలకు పెళ్లి చేసే సంప్రదాయానికి స్వస్తి పలకాలని, బంజారాల పిల్లల చదువుల కోసం బీర్ల ఫౌండేషన్ ద్వారా సహాయం చేస్తానన్నారు. సంత్ సేవాలాల్ ఆలయానికి రూ.10 లక్షలు ప్రకటించారు. బంజారాల కోసం మల్లాపురం పరిధిలో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన సందేశాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసినప్పుడే అత్యున్నత స్థాయిలో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, జెడ్పీ సీఈఓ శోభారాణి, అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, ఎంపీటీసీ కర్రె విజయ వీరయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

బీబీనగర్ : వ్యవసాయానికి సరఫరా చేస్తున్న 24 గంటల కరెంట్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలని, రైతులకు అందుబాటులో ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇడుకుడి శ్రీనాథ్ ఆశాఖ ఉద్యోగులకు సూచించారు. బీబీనగర్‌లోని పీఆర్‌జీ గార్డెన్‌లో గురువారం బొమ్మలరామారం, బీబీనగర్ మండలాల విద్యుత్ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. పంటలు ఎండిపోకుండా ప్రణాళికాబద్ధంగా విద్యుత్ సరఫరా చేయాలని, బ్రేక్‌డౌన్ అయినా, ఇతర సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీబీనగర్ సబ్ డివిజన్ ఇంజనీర్ కృష్ణయ్య, బీబీనగర్, బొమ్మల రామారం ఏఈలు సాయిదీప్, మనోహర్ రెడ్డి, లైన్‌మన్ ర్యాకల బాల్‌నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిపై పట్టు ఎవరిదో!

- చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రయత్నాలు
- క్యాంపులో ఇరుపార్టీల కౌన్సిలర్లు
- 28న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక



సాక్షి, యాదాద్రి : భువనగిరి మున్సిపల్ రాజకీయం వేడెక్కింది. ఈనెల 28న చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నిక జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎవరికి వారు క్యాంపులు నెరపుతున్నారు. బీఆర్ఎస్‌కు ఎలాంటి అవకాశం దక్కనీయకుండా కాంగ్రెస్ ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. అయితే బీఆర్ఎస్ కౌన్సిలర్లు రెండు గ్రూప్‌లుగా చీలిపోవడం ఆ పార్టీని ఆందోళనకు గురి చేస్తోంది. ప్రస్తుతం తమకు అనుకూలంగా ఉన్న సభ్యులను కాపాడుకునేందుకు క్యాంపు నడుపుతోంది. మున్సిపల్ కౌన్సిల్‌లో 35 మంది కౌన్సిలర్లు ఉన్నారు.

రంగంలోకి ఎమ్మెల్యే

చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి రంగంలోకి దిగారు. తమ పార్టీ కౌన్సిలర్లతో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో ఆయన ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు 11 మంది కౌన్సిలర్లు ఉండగా ఇటీవల బీఆర్ఎస్, ఇండిపెండెంట్‌ల చేరిక, ఎక్స్ అఫిషియో సభ్యుడితో 16కు చేరింది. మెజార్టీకి మరో ఇద్దరు సభ్యులు అవసరం ఉండగా బీజేపీ సభ్యుల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

చీలిపోయిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

అవిశ్వాసం సమయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. 28న జరిగే ఎన్నికల్లో అసమ్మతి కౌన్సిలర్లు ఎవరికి మద్దతు ఇస్తారనేది చర్చనీయాంశంగా మారింది. అయితే ఇప్పటికీ కౌన్సిల్‌లో బీఆర్ఎస్, బీజేపీ కూటమికి మెజార్టీ ఉంది. రెండు పార్టీలు కలిసి పదవులను దక్కించుకుంటాయా అనే చర్చ కూడా సాగుతోంది. ఇందుకోసం ఎంపిక చేసే అభ్యర్థులపై గెలుపు ఆధారపడి ఉంది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ

చైర్మన్ పదవికోసం కాంగ్రెస్ నుంచి తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పోత్నక్ ప్రమోద్‌కుమార్ పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే వద్ద ఎవరికి వారు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

క్యాంపుల్లో ఇరుపార్టీల సభ్యులు

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ సభ్యులను క్యాంపులకు తరలించాయి. ఎన్నికల జరిగే 28వ తేదీన నేరుగా మున్సిపల్ కార్యాలయంలో జరిగే సమావేశానికి రానున్నారు.

> **బీజేపీ మౌనం వెనుక మతలబు ఏమిటో?**
>
> బీజేపీ కౌన్సిలర్లు మౌనంగా ఉన్నారు. అవిశ్వాస సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లతో బీజేపీ నడిచింది. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్‌లలో ఎవరికైనా మద్దతు ఇస్తుందా లేక తటస్థంగా ఉంటుందా అనే తేలాల్సి ఉంది. చైర్మన్ ఎన్నిక తేదీ నాటికి బీజేపీ అంతరంగం తెలిసే అవకాశం ఉంది.

కాంగ్రెస్ ఉద్ధరించేది ఏమీ లేదు

- కేసీఆర్‌పై కోపంతోనే జనం కాంగ్రెస్‌కు ఓట్లేశారు
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



చౌటుప్పల్ రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

చౌటుప్పల్, రామన్నపేట, సంస్థాన్‌నారాయణపురం : కేసీఆర్‌పై ప్రజల్లో ఉన్న కోపంతోనే కాంగ్రెస్‌కు అధికారం దక్కింది తప్ప.. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తుందని ప్రజలు ఆ పార్టీకి ఓట్లు వేయలేని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా రామన్నపేటలో విశ్వకర్మ యోజన సదస్సులో, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం రోడ్ షోల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు వాటిని అమలు చేసేందుకు దిక్కులు చూస్తుందని విమర్శించారు. గత బీఆర్ఎస్ సర్కార్ కూడా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దళితబంధు, బీసీబంధుతో ప్రభుత్వ పథకాలంటేనే నమ్మకం పోయేలా చేశారని కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. కామారెడ్డిలో తనను ఓడించడానికి సీఎం, మాజీ సీఎం డబ్బులు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేసినా ప్రజలు తమకోసం పనిచేసే నాయకున్ని ఎన్నుకున్నారని పేర్కొన్నారు. స్వలాభాల కోసం అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు దూకి ఉప ఎన్నిక తెప్పించిన నాయకులు ఈ ప్రాంతంలో ఉన్నారని పేర్కొన్నారు. మోదీ పాలనే దేశానికి శ్రీరామరక్ష అన్నారు. పదేళ్లలో దేశ ప్రగతి, సమగ్రతకు అవరోధంగా ఉన్న అడ్డంకులు తొలగిపోయి విశ్వవేదికపై భారత్ కీర్తి ప్రతిష్టలు పెరిగాయన్నారు. విశ్వకర్మయోజన పథకంలో దరఖాస్తు చేసుకున్న చేతివృత్తి దారులందరికీ వేతనంతో కూడిన శిక్షణ ఇవ్వడమే కాకుండా బ్యాంకు రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 17ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధికి లంకె బిందెల్లా భారీగా నిధులు వస్తాయని, కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఖాళీ బిందెలు మిగులుతాయన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగాలేదన్నారు. కేంద్రం ఇస్తేనే రాష్ట్ర ప్రభుత్వం పప్పులు ఉడుకుతాయన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ అమలుకు సాధ్యం కాని హామీలిచ్చిన కాంగ్రెస్ బండారం త్వరలోనే బయటకు వస్తుందన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు నిధుల కోసం చిప్పలు పట్టుకొని ఢిల్లీలో తిరుగుతున్నారని విమర్శించారు. అక్కడ మోదీ కాళ్లు పట్టుకుంటూనే ఇక్కడికి వచ్చి ఆయనను దూషిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘన స్వాగతం : విజయ సంకల్పయాత్రకు ఆయా ప్రాంతాల్లో ఘన స్వాగతం లభించింది. చౌటుప్పల్ పట్టణంలో లింగోజిగూడెం వద్ద గ్రామ మాజీ సర్పంచ్‌లు రమనగోని శంకర్, రమనగోని దీపిక ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పాపారావు, కృష్ణయాదవ్, యాదాద్రి, నల్లగొండ జిల్లాల అధ్యక్షులు పాశం భాస్కర్, వర్షిత్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా కార్యదర్శులు కన్నెకంటి వెంకటేశ్వరాచారి, వనం అంజయ్య, టెలికాం అడ్వయిజరీ బోర్డు సభ్యుడు రమనగోని శంకర్, యాత్ర ప్రముఖ్ భరత్‌గౌడ్, నాయకులు రిక్కల సుధాకర్ రెడ్డి, నందికొండ గీతారెడ్డి, తాటిపాముల శివక్రిష్ణ గౌడ్, మైల నర్సింహ, గుండగోని భరత్, శానగొండ మల్లికార్జున్, యాదాసు లక్ష్మణ్, అక్కెనపల్లి సైదులు, తాటిపాముల లింగస్వామి, రాపోలు స్వామి, బట్టి రమేష్, ముగ్గ నర్సింహ, దోనూరి వీరారెడ్డి, ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పాలకూర్ల జంగయ్య, పోలోజు శ్రీధర్ బాబు, కంచర్ల గో వర్ధన్‌రెడ్డి, ఆలె చిరంజీవి, బాతరాజు సత్యం, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, దాసోజు వెంకటాచారి, సుర్వి రాజు, సూరపల్లి శివాజీ, జక్కలి రాజు, వీఎస్ గౌడ్, ఆత్కూరి రాములు పాల్గొన్నారు.

8.5 లక్షల ఎకరాలకు నీరు

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం

- డిండికి ఏదుల నుంచి నీరుతెచ్చే యోచనలో ప్రభుత్వం
- 16 కిలో మీటర్ల టన్నెల్, 7 కిలో మీటర్ల కాలువ
- ఎమ్మెల్యేలు, అధికారులతో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి సమీక్ష
- సగంలో ఆగిన పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం



సమీక్షా సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి దాదాపు 8.5 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్, డిండి ఎత్తిపోతల పథకం, బ్రాహ్మణవెల్లెంల, మూసీ పరిధిలోని బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల విస్తరణ, ఇతర సాగునీటి పథకాలకు నిధుల కొరత రానీయకుండా, యుద్ధ ప్రాతిపదికన పనులను చేపట్టి పూర్తి చేయాలని నిర్ణయించింది. సాగునీటి ప్రాజెక్టులపై ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అధికారులతో నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం హైదరాబాద్ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రాజెక్టులకు సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు సమీక్షించి, వేగంగా కొనసాగించేందుకు అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

ఏదులనుంచి డిండికి నీళ్లు

పాలమూరు –రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అంతర్భాగంగా డిండి ఎత్తిపోతల పథకాన్ని 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా గత ప్రభుత్వం చేపట్టింది. దాని కింద చేపట్టిన రిజర్వాయర్లలో కొన్ని 95 శాతం పనులు పూర్తికాగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ఆ ప్రాజెక్టుకు సాగునీటికి ఎక్కడి నుంచి తీసుకోవాలన్న విషయాన్ని అప్పటి ప్రభుత్వం తేల్చలేదు. పాలమూరు – రంగారెడ్డి పరిధిలోని మొదటి రిజర్వాయర్ అయిన నార్లాపూర్ నుంచి నీటిని తీసుకోవాలని అప్పటి ప్రభుత్వం భావించింది. ఆ తరువాత రెండో రిజర్వాయర్ అయిన ఏదుల నుంచి తీసుకుకోవాలనుకుంది. దీనికి టన్నెల్ తవ్వాల్సి వస్తుండటంతో దానిని పక్కన పెట్టింది. ఆ తరువాత మూడో రిజర్వాయర్ అయిన వట్టెం నుంచి నీటిని తీసుకోవాలని భావించింది. అది భారీ వ్యయంతో కూడుకున్నది కావడంతో పక్కన పెట్టింది. ఆ తరువాత ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. అయితే, గురువారం జరిగిన సమావేశంలో ఏదుల నుంచే నీటిని తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. జిల్లా ఎమ్మెల్యేలు కూడా ఏదులనే ప్రతిపాదించారు. ఇందుకు 16 కిలోమీటర్ల టన్నెల్, 7 కిలోమీటర్ల కాలువలు తవ్వాల్సి ఉంటుంది. దీనికి దాదాపు రూ.3 వేల కోట్లు (ఇందులో రిజర్వాయర్లకు రూ.వేయి కోట్లు) అవసరమని తేల్చింది. ఆ నిధులను ప్రభుత్వం ఇస్తుందని, పనులను వేగంగా చేపట్టాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. అయితే, టన్నెల్ లేకుండా ప్రత్యామ్నాయం సాధ్యం అవుతుందా? అన్నదానిపైనా చర్చించినట్లు తెలిసింది. పెండ్లిపాకల కూడా పూర్తి చేయాలని నిర్ణయించారు. దీనికి మరో రూ.90 కోట్లు ఇచ్చేందుకు ఓకే చెప్పారు. మరోవైపు డిండి కింద నిర్మిస్తున్న సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాయినిపల్లి, చర్లగూడెం (శివన్నగూడెం) రిజర్వాయర్ల పరిధిలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి.

> **మూసీ కాలువల వెడల్పునకు నిర్ణయం**
>
> వృథాగా పోతున్న మూసీ నీటిని సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పిలాయిపల్లి, ధర్మారెడ్డి, కాలువల ఆధునీకరణ, విస్తరణకు అవసరమయ్యే నిధులను ఇవ్వాలని నిర్ణయించింది. తద్వారా మరో లక్ష ఎకరాలకు సాగునీటిని అందించాలని నిర్ణయించింది.

వేగంగా టన్నెల్ పనులు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేసిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను వేగంగా చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దానికి సంబంధించిన సాంకేతిక సమస్యలు అన్నింటిని పరిష్కరించాలని నిర్ణయించారు. 44 కిలోమీటర్ల టన్నెల్‌లో ఇంకా 9 కిలోమీటర్ల పొడవున టన్నెల్ తవ్వాల్సి ఉంది. దీనిని పూర్తి చేయడం ద్వారా జిల్లాలోని 3.5 లక్షల ఎకరాలకు రెండేళ్లలో అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు బ్రాహ్మణ వెల్లెంలను పూర్తి చేయాలని నిర్ణయించింది. కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను కూడా నాలుగైదు రోజుల్లో చెల్లించి పనులను వెంటనే ప్రారంభించేలా సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.ఈ సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి పాలొన్నారు.

క్లుప్తంగా

రైస్ మిల్లులో మెట్ల పైనుంచి పడి కూలి మృతి

వేములపల్లి: రైస్ మిల్లులో పనిచేస్తున్న కూలి మెట్ల పైనుంచి పడి మృతిచెందాడు. ఈ ఘటన వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో గల సంతోష్ రైస్ మిల్లులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి గ్రామానికి చెందిన మిర్యాల రంగయ్య(60) శెట్టిపాలెం శివారులోని సంతోష్ రైస్ మిల్లులో కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం రంగయ్య మిల్లులో దుమ్ము దులుపుతుండగా ప్రమాదవశాత్తు మెట్ల పైనుంచి కాలుజారి కిందపడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ తగాదాలతో వివాహిత ఆత్మహత్య

కొండమల్లేపల్లి: కుటుంబ తగాదాలతో దేవరకొండ పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్‌లో గురువారం ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పోలీస్ క్వార్టర్స్‌లో అలుగుబెల్లి రఘుమారెడ్డి, శ్రీవాణి దంపతులు నివాసముంటున్నారు. రఘుమారెడ్డి నేరెడుగొమ్ము పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ నెల 20వ తేదీన ఓ ప్లాట్ కొనుగోలు విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజున ఎప్పటిలాగే రఘుమారెడ్డి విధులకు వెళ్లగా ఇంట్లో ఉన్న శ్రీవాణి జుట్టుకు రంగు వేసుకునే కెమికల్‌ను తాగడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. రఘూమారెడ్డి మధ్యాహ్నం విధులు ముగించుకొని ఇంటికి వెళ్లి చూడగా తన భార్య శ్రీవాణి అపస్మారకస్థితిలో ఉండడాన్ని గమనించి వెంటనే దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతిచెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గద్దెనెక్కిన సమ్మక్క



రాజాపేట : చిన్నమేడారంలో కిటకిటలాడుతున్న భక్తులు



ఆలేరురూరల్: కొలనుపాక సమీపంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



రాజాపేట: చల్లూరు యాదాద్రి మేడారంలో సమ్మక్క ఊరేగింపును చూస్తున్న భక్త జనం

- మినీ మేడారాలలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు

ఆలేరురూరల్: ఉమ్మడి జిల్లాలోని రాజాపేట, పెద్దవూర, పెన్‌పహాడ్, ఆలేరు మండలాల్లో జరుగుతున్న మినీ మేడారాలలో గురువారం సమ్మక్క గద్దెనెక్కింది. ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామ సమీపంలో కొనసాగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతరలో భాగంగా రెండో రోజు గుట్టల పైన ఉన్న సారలమ్మ, సమ్మక్కకు నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

రాజాపేటలో..

రాజాపేట: మండలంలోని చిన్నమేడారం, చల్లూరు యాదాద్రి మేడారంలో కోయ బిడ్డలు సమ్మక్క–సారలమ్మ కొలువుదీరారు. ఆలయ పూజారులు సమీప గుట్టలపై మూలదేవతామూర్తికి చలపయ్యను(దూడను) బలిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు గ్రామస్తులతో కలిసి సమ్మక్కను ఆలయాల వద్దకు తీసుకొచ్చారు. అనంతరం గద్దెపై ప్రతిష్ఠించారు. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు చిన్నమేడారంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలేరు ప్రాంత ప్రజలపై సమ్మక్క, సారలమ్మ కరుణ ఉండాలని కోరుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కిక్కిరిసిన భక్తులు

పెన్‌పహాడ్: మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామ శివారులో సమ్మక్క–సారలమ్మ జాతర రెండో రోజు కూడా భక్తులు కిక్కిరిశారు. ఈ సందర్భంగా పూజారి బాలకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బంగారం (బెల్లం) మొక్కుగా చెల్లించారు. గొర్రె, మేక పొట్టేళ్లను, కోళ్లను బలిచ్చారు. నాగులమ్మ గుడి వద్ద భక్తులు కుంకుమ, పసుపు చల్లి పూజలు చేశారు. సమ్మక్క–సారలమ్మ జాతర ఉత్సవాలకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలుగు రాష్ట్రాల స్థాయి కోలాటం పోటీలను ప్రారంభించారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కొప్పుల వేణారెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు, మండల పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్‌రావు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : సమ్మక్క, సారలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

వన దేవతలకు మొక్కులు

పెద్దవూర: మండలంలోని పొట్టిచల్మ ఎక్స్ రోడ్డు వద్ద పవిత్ర కృష్ణా నది సమీపంలో చిన్న మేడారంగా పిలిచే సమ్మక్క–సారలమ్మ జాతరలో భాగంగా గురువారం వేకువజామున సమ్మక్క గద్దెకు చేరింది. సమీప గ్రామాల ప్రజలు వనదేవతలను సందర్శించి నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించుకున్నారు. ఈ జాతర మరో రెండు రోజుల పాటు జరగనున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారులు, ధర్మకర్తలు గుంజ అంజమ్మ, గుంజ కృష్ణంరాజు, నాగపురి లక్ష్మి పాల్గొన్నారు.



పెద్దవూర: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పూర్వగిరిలో కల్యాణ వైభోగం



హనుమంత వాహనంపై స్వామివారిని తిరువీధికి తీసుకెళ్తున్న ఆచార్యులు



పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

- పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా స్వామి, అమ్మవార్ల పరిణయ వేడుక
- ఉదయం హనుమంత వాహనంపై ఊరేగిన స్వామివారు

యాదగిరిగుట్ట: పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం గురువారం రాత్రి కనుల పండువగా జరిగింది. నరసింహస్వామిని గజ వాహనంపై, శ్రీలక్ష్మి అమ్మవారిని ప్రత్యేక పల్లకీలో ఆలయ తిరువీధుల్లో ఊరేగిస్తూ కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. ఆలయ ఈఓ రామకృష్ణారావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో ఊరేగింపుగా కల్యాణ వేదికకు చేరుకున్నారు. అనంతరం అర్చకులు కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టి మాంగళ్య ధారణ చేయించారు.

ఉదయం హనుమంత వాహనంపై..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8గంటలకు పారాయణీకులచే నిత్య ప్రబంధ పారాయణములు, యాజ్ఞీకులచే నిత్య హవనములు, మూల, మూర్తిమంత్ర అనుష్టానములు, హవనం పూజలు జరిగాయి. అనంతరం స్వామి, అమ్మవారికి తిరుమంజన మహోత్సవం నిర్వహించారు. కల్యాణమూర్తులైన లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను హనుమంత వాహనసేవలో తిరువీధిలో ఊరేగించారు. ఆస్థాన మండపంలో హనుమంత వాహనంపై అధిష్ఠింపజేసిన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వం తరఫున ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయా వేడుకల్లో ఈఓ రామకృష్ణారావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మున్సిపల్ చైర్మన్ ఎరుకల సుధా, కౌన్సిలర్ దండబోయిన అనిల్, ఆలయాధికారులు, ప్రధానాచార్యులు, ఉప ప్రధానార్చకులు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

యాదగిరిగుట్టకు చెందిన శ్రీకుసుమ హరినాథ భజన మండలి, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి మహిళా భజన మండలిచే భజన నిర్వహించారు. జీవీఆర్ మ్యూజిక్ ఇనిస్టిట్యూట్ వారిచే భక్తి సంగీతం జరిగింది. యాదగిరిగుట్టకు చెందిన జగిని హరీష్ బృందం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు.

నేడు రథోత్సవం

శుక్రవారం ఉదయం హవనం పూజల అనంతరం గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు. రాత్రి 8గంటలకు రథోత్సవాన్ని జరిపిస్తారు.



కల్యాణం తిలకిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భక్తులు తదితరులు

వీధి కుక్కల దాడిలో మరో జింక మృతి

నాగార్జునసాగర్, పెద్దవూర: అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్‌లో భాగమైన నాగార్జునసాగర్ ఫారెస్ట్ కోర్ ఏరియాలో మరో జింక మృతి చెందింది. ఈ నెల 8వ తేదీన కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందగా.. అదే తరహాలో గురువారం మరో జింకను కుక్కలు దాడి చేసి చంపాయి. నాగార్జునసాగర్–హైదరాబాద్, నల్లగొండ రహదారి వెంట జలాశయ తీరంలో ఇటీవల ప్రారంభించిన అర్బన్ పార్కులో పర్యాటకులు చూసేందుకు వీలుగా ఇతర ప్రాంతాల నుంచి జింకలను తీసుకొచ్చి పార్కు ఏరియాలో వదిలారు. పార్కుకు మూడు వైపులా మాత్రమే కంచె ఏర్పాటు చేశారు. వెనుక వైపు అటవీ ప్రాంతం ఉంది. సమీపంలోనే తండాలు ఉన్నాయి. అర్బన్ పార్కులో జింకలు తాగేందుకు నీటిని ఏర్పాటు చేయడంతో పాటు వాటికి ఆహారం కోసం గడ్డిని పెంచారు. అయినప్పటికీ జింకలు రాత్రివేళ సమీపంలోని పంట చేలు, గ్రామాల్లోకి వెళ్లి వస్తున్నాయి. దీంతో వీధి కుక్కలు జింకల వెంట పడి చంపుతున్నాయి. ఇప్పటికైనా అటవీ అధికారులు జింకలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మృతిచెందిన జింక

రేపు కోదాడకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు జడ్జి భవ్య, బార్ అసోసియేషన్ సభ్యులు

కోదాడఅర్బన్: కోదాడలో కోర్టు భవనాల పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు కోదాడలో ఏర్పాటు చేసిన రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రారంభించడానికి శనివారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే రానున్నారు. ఈ నేపథ్యంలో కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ అదనపు జడ్జి భవ్య గురువారం కోదాడ బార్ అసోసియేషన్ కార్యవర్గంతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి బార్ అసోసియేషన్ కార్యవర్గానికి పలు సూచనలు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ టి. వినోద్‌కుమార్, జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ బి. విజయసేన్‌రెడ్డి, జస్టిస్ పుల్లా కార్తీక్‌తో పాటు జిల్లా జడ్జి రాజ్ గోపాల్ తదితులు హాజరవుతున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, శరత్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

హుజూర్‌నగర్: మనో వేదనతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం హుజూర్‌నగర్‌లో జరిగింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి సీదా ఆనంద్, అనంతలక్ష్మి దంపతులు ఉద్యోగరీత్యా హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీమన్నారాయణకాలనీలో నివాసముంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు అఖిల్‌కుమార్(24) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో 2022లో డిగ్రీ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఇటీవల ఉద్యోగం వస్తదో రాదో అంటూ తీవ్ర మనో వేదనకు గురవుతుండేవాడు. అతడికి అన్న నిఖిల్ కుమార్ ధైర్యం చెబుతుండేవాడు. ఇదిలా ఉండగా సీదా ఆనంద్‌కు ఇటీవల ఆరోగ్యం బాగాలేకపోవడంతో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రిలో వైద్య చికిత్స చేయించారు. గురువారం అతడిని ఆస్పత్రి నుంచి డిచ్చార్జి చేస్తామని డాక్టర్లు చెప్పడంతో పెద్ద కొడుకు నిఖిల్ కుమార్, భార్య అనంతలక్ష్మి ఇద్దరు కలిసి హుజూర్‌నగర్ నుంచి బయల్దేరి నార్కట్‌పల్లికి వెళ్లారు. ఇంట్లో అఖిల్ కుమార్ ఒక్కడే ఉన్నాడు. దీంతో అఖిల్ కుమార్‌కు తోడుగా ఉండమని అతడి మిత్రుడికి నిఖిల్ కుమార్ ఫోన్ చేసి చెప్పాడు. ఈ మేరకు అఖిల్ ఇంటికి వెళ్లిన అతడి మిత్రుడు ఏదో పని ఉందని బయటకు వెళ్లి వచ్చేసరికి అఖిల్ తలుపులు వేసుకుని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత అతడి మిత్రుడు వచ్చి చూసేసరికి అఖిల్ ఉరికి వేలాడుతుండడంతో గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే అఖిల్‌ను హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి అన్న నిఖిల్ కుమార్ ఇచ్చిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.



అఖిల్ మృతదేహం

తాళం వేసిన ఇంట్లో చోరీ

మిర్యాలగూడ టౌన్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన గురువారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రూరల్ ఎస్ఐ సతీష్‌వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి దీపక్ కుటుంబ సభ్యులు గురువారం ఇంటికి తాళం వేసి మిర్యాలగూడలోని ఓ ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని దుస్తులు చిందరవందర పడి ఉన్నాయి. బీరువాలో ఉంచిన 16 గ్రాముల బంగారు చైన్, ఒక రింగ్ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ చేస్తూ కంటపడిన దొంగ..

ఆత్మకూరు(ఎం): మండలంలోని రాఘవాపురంలో గురువారం తాళం వేసిన ఇంట్లో అదే గ్రామానికి చెందిన వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవాపురం గ్రామానికి చెందిన తుమ్మలగూడెం రామనర్సయ్య, రాధ దంపతులు గురువారం తమ ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. రాధ మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా.. అదే గ్రామానికి చెందిన బద్దుల అనిల్ బీరువా తెరిచి పది తులాల బంగారు ఆభరణాలు చోరీ చేస్తుండటం గమనించి ఆమె గట్టిగా కేకలు వేసింది. దీంతో బద్దుల అనిల్ ప్రహరీ దూకి పారిపోయాడు. కొద్దిదూరంలో కాటం మత్స్యగిరి అనే రైతు బైక్ తీసుకుని అనిల్ పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దొమ్మేటి నాగరాజు తెలిపారు. రామనర్సయ్యకు నిందితుడు బద్దుల అనిల్ మేనల్లుడి వరుస అవుతాడని, ఓ చోరీ కేసులో నిందితుడిగా ఉన్న బద్దుల అనిల్ ఇటీవలే జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది.

మాసుకుంట గుట్టపై చెలరేగిన మంటలు

భువనగిరి క్రైమ్ : మండలంలోని రాయిగిరి ఆవాసం మాసుకుంట గుట్టపై ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల వెనుక గురువారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గుర్తుతెలియని వ్యక్తులు ధూమపానం చేయడం వల్ల మంటలు చెలరేగాయని స్థానికులు చెబుతున్నారు. సమీపంలో టపాకాయల విక్రయ కేంద్రాలు ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



గుట్టపై ఎగసిపడుతున్న మంటలు

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

భువనగిరి క్రైమ్: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు పుస్తెలతాడు లాక్కెళ్లారు. ఈ ఘటన భువనగిరి పట్టణంలో గురువారం జరిగింది. వివరాలు.. భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన కడమంచి పుష్ప ప్రగతినగర్‌లోని చర్చికి వెళ్లి ఆటోలో పాత బస్టాండ్‌లో దిగింది. అక్కడి నుంచి అర్బన్ కాలనీకి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వెనుక నుంచి బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కోని పరారయ్యారు. చోరీకి గురైన పుస్తెలతాడు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. ఈ మేరకు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

కనగల్: మండల పరిధిలోని పొనుగోడులో తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. వివరాలు.. పొనుగోడు గ్రామానికి చెందిన మెరుగు లింగయ్య(49) రోజుమాదిరిగా బుధవారం ఉదయం కల్లు గీసేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారిపడ్డాడు. తీవ్ర తీవ్రగాయాలపాలైన లింగయ్యను చుట్టుపక్కల రైతులు గమనించి నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గురువారం సాయంత్రం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నార్నే ఎస్టేట్‌లోని సీలింగ్ భూమి స్వాధీనం

- రైతుల నుంచి కొనుగోలు చేసినట్టు గుర్తించిన అధికారులు
- ఆ భూముల చుట్టూ హద్దురాళ్లు ఏర్పాటు చేస్తామని వెల్లడి

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని పడమటిసోమారం గ్రామ పరిధిలో నార్నే ఎస్టేట్ సంస్థ అధీనంలో గల సర్వే నెంబర్ 254లోని 4ఎకరాల 10గుంటల సీలింగ్ భూమిని గురువారం జిల్లా రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నార్నే ఎస్టేట్ యాజమాన్యం సీలింగ్ భూములను కొనుగోలు చేయడం, కబ్జాలకు పాల్పడినట్లు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈమేరకు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఆర్డీవో అమరేందర్‌లు నార్నే సంస్థ అధీనంలో ఉన్న భూములను పరిశీలించారు. సర్వే ప్రకారం రికార్డులను పరిశీలించగా సర్వే నెంబర్ 254లో 4ఎకరాల 10గుంటల భూమిని రైతులకు సేద్యం కోసం ప్రభుత్వం కేటాయించగా సదరు రైతుల నుంచి నార్నే ఎస్టేట్ యాజమాన్యం కొనుగోలు చేసిందని, వాటిని వ్యవసాయేతర భూములుగా మార్చి ప్లాట్లను చేసి విక్రయించినట్లు విచారణలో తేలింది. దీంతో భూములను స్వాధీనం చేసుకున్నామని, వాటి చుట్టూ హద్దురాళ్లు వేస్తామని అధికారులు చెప్పారు. అసలైన పట్టాదారులు సీలింగ్ భూములు విక్రయించినందుకు నోటీసులు జారీచేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. బీబీనగర్‌లో నార్నే సంస్థకు 1973 ఎకరాల భూమి ఉండగా అందులో 739 ఎకరాలు భూదాన్ భూమి ఉందని, దానిపై కోర్టులో కేసు నడుస్తున్నట్లు తెలిపారు.



సీలింగ్ భూములను గుర్తిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

కోదాడరూరల్: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని కొమరబండ శివారులో గురువారం జరిగింది. కోదాడ రూరల్ ఎస్ఐ ఎం. అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా గురజాలకు చెందిన యాగంటి అమరలింగయ్య, ఆయన భార్య లక్ష్మి(55) గురువారం బైక్‌పై శుభకార్యానికి హాజరయ్యేందుకు సూర్యాపేటకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో కోదాడ మున్సిపాలిటీ పరిధి కొమరబండ శివారులో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వారి బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా.. అమరలింగయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను కారు ఢీకొనడంతో..

కనగల్: మండల కేంద్రంలోని వాగుపై నిర్మించిన వంతెన సమీపంలో బుధవారం రాత్రి బైక్‌ను కారు ఢీకొట్టడంతో మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం కోయగూరోనిబావికి చెందిన ముసుగు యాదమ్మ(40) బుధవారం కనగల్ మండలం దర్వేశిపురంలో బంధువుల శుభకార్యానికి హాజరై సాయంత్రం 7గంటల సమయంలో తన సోదరుడైన ముచ్చపోతుల విష్ణు బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరింది. మార్గమధ్యలో కనగల్ బ్రిడ్జి సమీపంలో వీరి బైక్‌ను వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదమ్మకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందింది. విష్ణు, మరో మహిళ రమణమ్మ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యాదమ్మ మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



ఘటనా స్థలంలో లక్ష్మి మృతదేహం

న్యాయం చేయాలని రాస్తారోకో..

యాదమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి బంధువులు, ప్రజాసంఘాల నాయకులు గురువారం కనగల్‌లో సుమారు నాలుగు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. కాగా మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇచ్చేందుకు ఒప్పందం కుదరడంతో బాధితులు రాస్తారోకో విరమించుకున్నారు. అంతకుముందు నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ కొండల్‌రెడ్డి, కనగల్ ఎస్ఐ బోడిగ రామకృష్ణ గౌడ్ ఆందోళనకారులతో మాట్లాడారు.

బైక్ అదుపుతప్పి..

నాగారం: మండలంలోని ఫణిగిరి శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన చెరుకు ఉప్పలయ్య(48), అదే గ్రామానికి చెందిన కొమ్ము ఉపేందర్, మేడబోయిన ఉపేందర్ ముగ్గురు కలిసి గురువారం తిరుమలగిరిలో ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి రాత్రి సమయంలో బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. ఈ క్రమంలో ఫణిగిరి నుంచి ఈటూరు వైపు వెళ్తుండగా అదే సమయంలో ఈటూరు నుంచి ఫణిగిరి వైపు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న చెరుకు ఉప్పలయ్య ఎగిరి వెనుకకు పడటంతో తల రోడ్డుకు బలంగా ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.